రకరకాల మెత్తటి పూలు పరచిన శయ్య మీదనే నేను నిద్రిస్తాను. నా కోట శత్రు దుర్భేద్యమైన ఇనుప కోటగా ప్రసిద్ధి గాంచింది. నా పట్టపు రాణిగా అత్యంత సౌందర్యవతినే ఎన్నుకున్నాను. మరి నాకు ముక్తి లభించలేదే?"

అందుకాయన సన్నగా నవ్వి చెప్పాడు.

"నా బోధ నీకర్థం కాలేదు. నే చెప్పింది నువ్వు అనుభవిస్తున్న భౌతిక భోగాల గురించి కాదు. నీకు కరకర ఆకలి వేసేదాకా ఆగి అప్పుడు తిన్నదేదైనా అమృతంలా వుంటుంది. బాగా శ్రమపడితే నువ్వు దేనిమీద పడుకున్నా సరే, అది పుష్పాలు పరచిన పడకే అనిపిస్తుంది. భోగాసక్తి లేని యోగి పుంగవులని ఆశ్రయిస్తే నీకు వైరాగ్యం అలవడుతుంది. అదే నీ జీవితానికి పెట్టని కోట అవుతుంది. వారి సహాయంతో నువ్వు ధ్యానం చేయగా చేయగా అత్యంత సౌందర్యవతి అయిన ముక్తి కాంత నీకు లభ్యమౌతుంది. ఆమె ఇచ్చే ఆనందానుభవం ప్రపంచంలోని ఇక దేనితోనూ సరిపోలదు."

ఆ రాజుకి అప్పుడు జ్ఞానోదయమైంది. వెంటనే తన కొడుక్కి పట్టాభిషేకం చేసి వానప్రస్థం స్వీకరించి, తపస్సులో మునిగి పోయాడు. త్వరలోనే ఆయన్ని ముక్తి కాంత వరించింది.

## 5. దివ్యత్వం

ఓ ప్రొఫెసర్ నాస్తికుడు. అవకాశం వచ్చినప్పుడల్లా అతను దేవుడు లేడన్న విషయం బోధిస్తూంటాడు.

ఓ రోజు ఆ ప్రొఫెసర్‌కి, కొందరు విద్యార్థులకి దైవం ఉనికి మీద చర్చ వచ్చింది.

"ఇంతకీ దేవుడున్నాడంటారు?" వెటకారంగా ప్రశ్నించాడాయన.

"అవును సర్." చెప్పాడు ఓ విద్యార్థి.

"ఈ లోకమంతా దేవుడే చేసాడంటావు? ఆయన సృష్టించనిది ఏదీ లేదంటావు?"

"అవును సర్."

"ఐతే మనిషిలోని దుర్మార్గాన్ని కూడా దేవుడు సృష్టించినట్లేగా? అంటే దేవుడు దుర్మార్గుడన్నట్లేగా?" వెటకారంగా నవ్వుతూ ప్రశ్నించాడాయన

విద్యార్థులు ఆ లాజిక్‌కి సమాధానం చెప్పలేక తెల్లమొహాలేసారు. ఆయన క్లాస్‌లో దేవుడున్నాడని నమ్మే ఓ విద్యార్థి కూడా ఉన్నాడు. ప్రొఫెసర్ బోధనలని ఎప్పటికప్పుడు ఖండించే భక్తుడైన ఆ విద్యార్థి లేచి అడిగాడు.

"ప్రొఫెసర్‌గారూ, మిమ్మల్ని రెండు ప్రశ్నలు వేస్తాను. సరేనా?"

"సరే. అడుగు."

"చలి అనేది ఉందంటారా? లేదంటారా?"

"అదేం పిచ్చి ప్రశ్న? ఉంది. ఎందుకు లేదు?"

"నిజానికి చలి అనేదే లేదు సార్. వేడి లేని స్థితిని మనం చలిగా చెప్పుకుంటున్నాం. జీరో సెల్సియస్ అంటే, జీరో వేడిమి అని అర్థం. నా రెండో ప్రశ్నకి జవాబు చెప్పండి సార్. చీకటి అనేది వుందా?"

"ఎందుకు లేదు? ప్రతీ రాత్రి మనం దాన్ని చూస్తూనే వున్నాంగా?"

"చీకటనేదే లేదు సార్. వెలుతురు సోకని స్థితిని మనం చీకటిగా చెప్పుకుంటాం. అలాగే మానభంగాలు, హత్యలు, దొంగతనాలు లాంటి చెడ్డతనం కూడా లేనేలేదు సార్. వేడిమి లేకపోతే చలి, వెలుతురు లేకపోతే చీకటి ఎలా వుంటాయో అలాగే 'ప్రేమ' అనే దివ్యత్వం లేకపోవడాన్ని మనం దుర్మార్గంగా చెప్పుకుంటాం. దుర్మార్గం అనేది మీరు చెప్పినట్లు దేవుడి సృష్టి కాదు సార్. అది ఆయన ఉనికి సోకని స్థితి మాత్రమే." వివరించాడా విద్యార్థి.

## 6. సత్పురుషుడు

ఓ మతం పరంపరలోని ఓ మఠాచార్యుడు ఓ గ్రామంలో చాతుర్మాస దీక్ష నిర్వహిస్తున్నాడు. ఆయనని కొందరు గ్రామస్థులు కలిసి ఇలా అడిగారు.